ప్రజారోగ్యం

ఇవీ సేవలు : పారిశుద్ధ్య నిర్వహణ, కుక్కలు, పందుల బెడదపై ఫిర్యాదుల స్వీకరణ. సులభ్ కాంప్లెక్స్‌ల నిర్వహణ, ట్రేడ్ లైసెన్స్ ఫీజుల విధింపు.

ఇలా పొందాలి : ఇక్కడ సహాయ ప్రజారోగ్యాధికారి (ఏఎంవోహెచ్)తోపాటు శానిటరీ సూపర్‌వైజర్లు అందుబాటులో ఉంటారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో పాటు వార్డు శానిటరీ సెక్రటరీ కూడా ప్రతిరోజు వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉంటారు. వారిని ఉదయం ఆరు గంటలకు, మధ్యాహ్నం 2 గంటలకు కలవచ్చు. ఉదయం 11 గంటల తర్వాత జోనల్ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు.

సహాయ వైద్య ఆరోగ్యాధికారి (ఏఎంవోహెచ్)
డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్..
ఫోన్ నంబర్ : 9010715555

టౌన్‌ప్లానింగ్

ఇవీ సేవలు : కొత్తగా ఇల్లు నిర్మించాలనుకొనేవారు ఈ విభాగం నుంచి అనుమతులు తీసుకోవాలి. కొత్తగా ప్లాను తీసుకోవడానికి, ప్లానులో మార్పులు , లే అవుట్లు, వ్యక్తిగత భవన నిర్మాణాలు, ఆక్యుపెన్సీ పత్రాలు ఈ విభాగం నుంచి పొందవచ్చు. ప్రకటనల పన్నులను కూడా ఈ విభాగం సిబ్బందే చూస్తారు.

ఇలా పొందాలి: ఈ విభాగంలో ఏసీపీని సంప్రదించాలి. ఏసీపీతోపాటు ఒక టీపీఏ అందుబాటులో ఉంటారు. ప్లాన్ తీసుకోవడం నుంచి నిర్మాణాలకు సంబంధించిన అన్ని ఫిర్యాదులకు వారిని సంప్రదించవచ్చు.

ఏసీపీ : వెంకటరావు..
ఫోన్ నంబర్ : 8187898432

రెవెన్యూ

ఇవీ సేవలు : కొత్తగా ఇంటి పన్నులు విధించడం, యాజమాన్యపు హక్కు (టైటిల్) మార్పు, డిమాండ్ నోటీసుల్లో తప్పుల సవరణ, నో డ్యూస్ ధృవపత్రాల జారీ.

ఇలా పొందాలి : ఈ సేవలకు ముందుగా సంబంధిత సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. తదుపరి ప్రక్రియ కోసం ఉన్నతాధికారులను కలవాల్సి వస్తే జోనల్ కార్యాలయంలోని రెవెన్యూ అధికారులను కలవాలి. ఇక్కడ ఇద్దరు రెవెన్యూ అధికారులు, ముగ్గురు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు అందుబాటులో ఉంటారు. అవసరమైన చలానా చెల్లించి ఆయా సేవలకు దరఖాస్తు చేసుకోవచ్చు. జోన్‌లో ఇద్దరు సూపరింటెండెంట్లు కూడా అందుబాటులో ఉంటారు. పలు సందేహాలను వారి ద్వారా కూడా నివృత్తి చేసుకోవచ్చు.

రెవెన్యూ అధికారి : సీహెచ్.రామ్‌నారాయణ, ఫోన్ నంబర్ : 8897210764
రెవెన్యూ అధికారి : ఎం.శ్రీకాంత్, ఫోన్ నంబర్ : 9030181919

రండి.. పౌర సేవలు పొందుదామిలా..!

జీవీఎంసీ జోనల్ కార్యాలయం పలు సేవలకు వేదిక. జనన ధృవీకరణ నుంచి మరణ ధృవపత్రం వరకు అన్ని సేవలు ఇక్కడ లభిస్తాయి. ఇళ్ల నిర్మాణాలకు అనుమతుల మంజూరు మొదలు ఇంటి పన్నుల విధింపు, మదింపు, వీధుల్లో చెత్తల తొలగింపు, పింఛన్ల మంజూరు, వీధిదీపాల నిర్వహణ, పేదలకు ఇళ్ల కేటాయింపులు.. ఇలా రకరకాల సేవలను ప్రజలు పొందవచ్చు. వార్డు సచివాలయాల్లో ఈ సేవలు లభిస్తాయి. సచివాలయాల్లో సమస్య పరిష్కారం కాకపోతే ఆయా సేవలను అందించే ఉన్నతాధికారులు జోనల్ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. చాలామంది ఈ సేవలు ఎలా పొందాలో తెలియక ఇబ్బంది పడుతుంటారు. మీరు ఏ సేవ పొందాలన్నా.. ఇదిగో ఇలా చేస్తే సరి..!

- గాజువాక

సౌకర్యం కేంద్రం

ఇవీ సేవలు : ఇంటిపన్నులు, నీటి పన్నులు, వీఎల్‌టీలు **కట్టించుకోవడం**, యాజమాన్యపు హక్కు బదిలీ, **ప్రొఫెషనల్ ట్యాక్స్‌లు** కట్టించుకోవడం, కొత్త కుళాయి కనెక్షన్లకు దరఖాస్తులను స్వీకరించడం.

ఇలా పొందాలి : ఇక్కడ సౌకర్యం కేంద్రంలో రెండు కౌంటర్లు అందుబాటులో ఉంటాయి. ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ కేంద్రం పని చేస్తుంది. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి మూడు గంటల వరకు విరామం ఉంటుంది.



గాజువాక జోనల్ కార్యాలయం

ఎలక్ట్రికల్

ఇవీ సేవలు : వార్డుల్లో వీధి దీపాల నిర్వహణ, కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం, కొత్త దీపాలను అందుబాటులోకి తేవడం.

ఇలా పొందాలి : ఇక్కడ సహాయ ఇంజనీర్‌తో పాటు సహాయకులు అందుబాటులో ఉంటారు. ప్రజలు తమ ఫిర్యాదులను విభాగంలో ఏర్పాటు చేసిన రిజిస్టర్‌లో నమోదు చేయాలి. రిజిస్టర్ చేసిన ఫిర్యాదులకే వారు స్పందిస్తారు.

సహాయ ఇంజనీర్ : హేమ కుమార్
ఫోన్ నంబర్ : 9885714007

ఇంజనీరింగ్

ఇవీ సేవలు : వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన అంచనాలు రూపొందించి ప్రజలకు వసతులు అందుబాటులోకి తేవడం. వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణం.

ఇలా పొందాలి : జోనల్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఇద్దరు డిప్యూటీ ఇంజనీర్లతోపాటు ఐదుగురు సహాయ ఇంజనీర్లు, ఇద్దరు ఎమినిటీ కార్యదర్శులు అందుబాటులో ఉంటారు. ఉదయం క్షేత్ర పరిశీలనకు వెళ్తారు. 11 గంటల తర్వాత జోనల్ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు.

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ : ఎం.ఆర్.ఎస్.అప్పారావు
ఫోన్ నంబర్ : 9848889706

యూసీడీ

ఇవీ సేవలు : నగర సామాజికాభివృద్ధి విభాగం (యూసీడీ) ద్వారా వృద్ధాప్య, వితంతు, వికలాంగ, ఏఏవై పింఛన్ల పంపిణీ పర్యవేక్షణ జరుగుతుంది. కొత్త పింఛన్లు పొందాలనుకొనేవారు తొలుత తమ వార్డులోని సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. తదుపరి విచారణ కోసం ఈ విభాగంలోని అధికారులను సంప్రదించవచ్చు. స్వయం సహాయక సంఘాల కార్యక్రమాలు, ప్రభుత్వ గృహాల లబ్ధిదారుల ఎంపిక, ప్రభుత్వ పథకాల అమల్లో కీలక పాత్ర ఉంటుంది.

ఇలా పొందాలి : ఇక్కడ ఒక సహాయ ప్రాజెక్టు డైరెక్టర్‌తోపాటు సీడీవోలు అందుబాటులో ఉంటారు. వారితోపాటు ఫీల్డ్ ఫెసిలిటేటర్ల (ఎఫ్ఎఫ్) సేవలను కూడా ఈ కార్యాలయం నుంచి పొందవచ్చు.

ఏపీడీ : గంగాధర్,
ఫోన్ నంబర్ : 7729995947

వాటర్ సప్లై

ఇవీ సేవలు : కొత్త కొళాయి కనెక్షన్లు వేయడం, నీటి సరఫరాలో సమస్యలను పరిష్కరించడం.

ఇలా పొందాలి : గాజువాక జోన్‌లో నాలుగు వాటర్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఒక్కో ప్రాజెక్టుకు ఒక సహాయ ఇంజనీర్ ఉండేవారు. అయితే ప్రస్తుతం అన్ని ప్రాజెక్టులను ఒకే సహాయ ఇంజనీర్ పర్యవేక్షిస్తున్నారు. కొత్తగా నీటి కొళాయి వేయించుకోదలచినవారు ముందుగా ఏఈని కలిసి దరఖాస్తు సమర్పించాలి.

సహాయ ఇంజనీర్ : పి.కేదార్‌నాథ్
ఫోన్ నంబర్ : 8187892316

మరికొన్ని సేవలు

- జోనల్ కార్యాలయంలో కాల్ సెంటర్ అందుబాటులో ఉంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సిబ్బంది సేవలు అందిస్తారు. అన్నిరకాల ఫిర్యాదులను ఫోన్‌లో స్వీకరించి సంబంధిత శాఖకు అందజేసి వాటిని పరిష్కరించేవరకు ఫాలోఅప్ చేస్తారు. 0891–2753535 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.
- హెల్ప్‌డెస్క్ ద్వారా విభాగాల సేవలకు సంబంధించి జవాబుదారీతనం లభిస్తుంది. ఉదయం 10.30నుంచి సాయంత్రం 5 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారు.
- జోనల్ కార్యాలయంలో జనన, మరణాల రిజిస్ట్రేషన్ల విభాగం అందుబాటులో ఉంటుంది. ఇది జోనల్ కమిషనర్ పర్యవేక్షణలో కొనసాగుతుంది.
- 18 ఏళ్లు నిండినవారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చును.



వినతులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ (ఫైల్)

జోనల్ కమిషనర్

జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ చాంబర్ ప్రత్యేకంగా ఉంటుంది. కమిషనర్‌ను కలవడానికి వచ్చినవారు ముందుగా అక్కడి సిబ్బంది అనుమతి తీసుకోవాలి. జీవీఎంసీ అందించే అన్ని సేవల్లో తలెత్తే ఇబ్బందులకు జోనల్ కమిషనర్‌ను కలిస్తే పరిష్కారం లభిస్తుంది. ఇదిగాక, ప్రతి సోమవారం ఆయన నేతృత్వంలో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరిస్తారు. ఆరోజు ఇతర విభాగాలకు సంబంధించిన అధికారులందరూ అందుబాటులో ఉంటారు.

జోనల్ కమిషనర్ : బి.ఆర్.ఎస్.శేషాద్రి
ఫోన్ నంబర్ : 9666673949

క్లుప్తంగా

డ్రైవింగ్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: ప్రభుత్వ న్యూఐటీఐ డ్రైవింగ్ స్కూల్‌లో హెవీ మోటార్ వెహికల్, లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై ఉండాలని, అభ్యర్థుల వయసు 18 ఏళ్లు నిండి ఉండాలన్నారు. 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, అభ్యర్థుల ఎల్ఎల్ ఆర్ కలిగి ఉండాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 24 లోగా ఐటీఐలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9491762841 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా జాతీయ రహదారి భద్రతా దినోత్సవం



ఉక్కు బీసీ గేటు వద్ద రహదారి భద్రతపై ప్రచారం చేస్తున్న భద్రతా విభాగం ఉన్నతాధికారులు

ఉక్కునగరం: జాతీయ రహదారి భద్రతా దినోత్సవాన్ని శుక్రవారం స్టీల్‌ప్లాంట్‌లో ఘనంగా నిర్వహించారు. 36వ భద్రతా దినోత్సవం సందర్భంగా ఉక్కు బీసీ గేటు వద్ద భద్రతా విభాగం ఆధ్వర్యంలో రహదారి భద్రత ఆవశ్యకతపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా భద్రతా విభాగం జీఎం ఎం.ఎస్.ఎన్. రాజు, డీజీఎం ఎం. వరప్రసాద్ మాట్లాడుతూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే దానికి భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్నం ఈడీ (వర్క్స్) కాన్ఫరెన్స్ హాలులో భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ భద్రతా ప్రసంగ నిపుణులు ఎ.డి. జోషి, స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) ఆర్. మొహంతి, సీజీఎం ప్రవీణ్‌కుమార్‌లు రహదారి భద్రత ప్రాధాన్యంపై ప్రసంగించారు. కార్యక్రమంలో భద్రతా విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జ్యోతిబసుకు సీపీఎం నాయకుల నివాళి



జ్యోతిబసు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

గాజువాక: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసుకు సీపీఎం గాజువాక జోన్ నాయకులు నివాళులర్పించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జ్యోతిబసు వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పార్టీ గాజువాక కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ జ్యోతిబసు పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు పి.వై.వి.రమణారావు, ఆర్.నాగేశ్వరరావు, ఎల్.బంగారునాయుడు, గొలగాని అప్పారావు, గొల్ల రాము, ఎస్.గణేష్, గొల్ల అప్పారావు, సింహాద్రిరాజు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

పెదగంట్యాడ: నడుపూరులో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. హెల్ప్ ఏజ్ ఇండియా వారి సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ ఎక్స్ సర్వీసెస్ లీగ్ ప్రధాన కార్యదర్శి రౌతు గోవిందరావు ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 200 మంది రోగులకు వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మడసాల అప్పారావు, గంధం వెంకటరావు, బలగా బాబునాయుడు, రమణ, వినోద్, చంటి తదితరులు పాల్గొన్నారు.

ఇరుకు గది... ఒకటే మరుగుదొడ్డి



ఇరుగ్గా ఉన్న విశ్రాంతిగది



మహిళలు, పురుషులు మరుగుదొడ్డి ఎదురుగా కూర్చున్న దృశ్యం

అగనంపూడి: అసలే ఇరుకు విశ్రాంతి గది... ఆపై పురుషులకు, మహిళలకు ఒకటే. ఆవరణలోని మరుగుదొడ్డికి వెళ్లాలన్నా, వాష్‌రూమ్‌కు వెళ్లాలన్నా ఇబ్బందిపడుతున్నారు. చిన్నపిల్లల తల్లులు అయితే కనీసం పిల్లలకు ఫీడ్ ఇవ్వడానికి కూడా బిడియ పడాల్సిన పరిస్థితి. మరో వైపు ఫ్లష్ ట్యాంక్ పనిచేయదు. నీరు సరిగా సరఫరా జరగదు. ఒకటే దుర్వాసన. మరోపక్క ఒకటే స్నానాల గది. వాటి నిర్వహణ అధ్వానంగా ఉండడంతో కుటుంబ సభ్యులతో విశ్రాంతి తీసుకోడానికి ఇబ్బంది పడుతూ ప్లాట్‌ఫారంలోని బెంచీలపైనే సేదతీరుతున్నారు. నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం ముఖ ద్వారం పక్కనే విశ్రాంతి గది ఉన్నా కనీస నిర్వహణ లోపం కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో మరో మరుగుదొడ్డితో పాటు వేర్వేరు విశ్రాంతి గదులు ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

దోపిడీ దొంగల అరెస్ట్

అక్కిరెడ్డిపాలెం: బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్న యువకుడిని ఇద్దరు వ్యక్తులు అడ్డగించి సెల్ ఫోను, నగదు దోచుకున్నారు. బాధితుడు గాజువాక క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టి ఇద్దరు దొంగలను అదుపులోకి తీసుకున్నారు. గాజువాక సౌత్ క్రైం సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు. బాధితుడు అక్కిరెడ్డిపాలేనికి చెందిన యల్లపు సారథి (27) షీలానగర్‌లో రామేశ్వరం ఫుడ్స్ హోటల్ నిర్వహిస్తుంటాడు. ఈ నెల 15వ తేదీన తెల్లవారు జామున 2.30 గంటల ప్రాంతంలో కోరమాండల్ హనుమాన్‌నగర్‌లో ఉంటున్న తన మేనత్త లక్ష్మి ఇంటి నుంచి ములగాడ మీదుగా అక్కిరెడ్డిపాలెం వస్తున్నాడు. సరిగ్గా ములగాడ ఏరియా పెంటమాంబ గుడి వద్ద ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి యువకుడిని అడ్డగించారు. అందులో ఒక వ్యక్తి సారథిని కదలకుండా పట్టుకొని జేబులో ఉన్న సెల్‌ఫోన్‌తో పాటు రూ.300 నగదు లాక్కోవడంతో గట్టిగా కేకలు వేయగా జింక్ శివాలయం కొండపైకి తీసుకువెళ్లి దాడి చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో ఏసీపీ–జోన్ 2 డి.లక్ష్మణరావు ఆదేశాల ప్రకారం సౌత్ సబ్ డివిజన్ క్రైం సీఐ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసుల బృందం శుక్రవారం జింక్ గేటు వద్ద శ్రీహరిపురం , పాతరామాలయం గుడి దగ్గర గల కుంచమ్మ కాలనీకు చెందిన మనోజ్ కుమార్ (19), కామడ బాలకృష్ణ (22) ఇద్దరిని అరెస్ట్ చేశారు. వీరి నుంచి సెల్ ఫోనుతో పాటు రూ.300 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దరూబాగా చదువుకున్నా చెడు అలవాట్లకు బానిసలై ఈజీ మనీ కోసం దారి దోపిడీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు.

సెయిల్‌లో విలీనంతోనే స్టీల్‌ప్లాంట్‌కు భవిత

సీతమ్మధార: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పూర్తిగా మనుగడ సాధించాలంటే సెయిల్‌లో విలీనం చేయాలని గాజువాక జోన్ సీపీఎం కార్యదర్శి ఎం.రాంబాబు,మాజీ కార్పొరేటర్ బొట్ట ఈశ్వరమ్మ డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అఖిల పక్ష ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం పార్కులో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష 1,389 రోజు కొనసాగింది. ఈసందర్భంగా రాంబాబు, ఈశ్వరమ్మ మాట్లాడుతూ ఆర్థిక ప్యాకేజీ స్టీల్ ప్లాంట్ కొంతమేర ఆర్థిక సమస్యల నుంచి బయటపడడానికి తాత్కాలిక ఉపశమనంగా ఉంటుందన్నారు. ఈ ప్యాకేజీ శాశ్వతమైన పరిష్కారం కాదని వారు చెప్పారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే, సొంత గనులు కేటాయించాల్సిందేనని డిమాండ్ చేశారు సెయిల్‌లో విలీనం చేయడం ద్వారానే విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ బలమైన సంస్థగా ఎదుగుతుందని చెప్పారు. దీనిపైన కూడా కేంద్రం ఎటువంటి నిర్ణయం ప్రకటించలేదన్నారు. ఆర్థిక ప్యాకేజీ ఏ రూపంలో ఇస్తున్నారో స్పష్టం చేయలేదని తెలిపారు. పూర్తిస్థాయిలో ఉద్యోగులను నియమించాలని.. అవసరమైన వసతులు కల్పించి పూర్తిస్థాయిలో ఉత్పత్తి సాధించడానికి సహకరించాలని డిమాండ్ చేశారు. రిలేనిరాహార దీక్షలో గొలగాని అప్పారావు, ఎ. నూకేశ్వరరావు, భానుమూర్తి, ఆనంద్ పాల్గొన్నారు.

నాలుగు రోజులు పరసల కోలాహలం

అక్కిరెడ్డిపాలెం: వరుసగా నాలుగు రోజుల పాటు పరసల కోలాహలం ప్రారంభం కానుంది. ఈ నెల 24న 68వ వార్డు రాంనగర్‌లో నూతనంగా నిర్మించిన రామాలయం పరసను, 25న గుడివాడఅప్పన్న కాలనీలో కోదండ రామాలయం పరస, 26న అక్కిరెడ్డిపాలెంలో శ్రీ కుంచమాంబ, దుర్గమాంబ అమ్మవార్ల పరస, 27న 69వ వార్డు నాతయ్యపాలెంలో బంగారు మాంబ అమ్మవారి పరస మహోత్సవాలు జరగనున్నాయి. నాలుగు రోజుల పాటు పరసలతో గాజువాక పరిసర ప్రాంతాల ప్రజలకు పండగేనని స్థానికులు అంటున్నారు.

విండ్‌బాల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



టాస్ వేస్తున్న కోమటి శ్రీనివాసరావు


అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి నిర్వాసితకాలనీ అప్పికొండ సీతారాముల పరస మహోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న విండ్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు గ్రామ పెద్దలతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, నాయకులు ఎన్నేటి రమణ, లక్కరాజు రామారావు మాట్లాడుతూ క్రీడల వల్ల నాయకత్వ లక్షణాలు మెరుగుపడతాయని, జీవితంలో ఎదరయ్యే సమస్యలను సులభంగా పరిష్కరించేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో వర్రె రాజు, సారిపల్లి రాంబాబు, వడ్లపూడి ఈశ్వరరావు, జెర్రిపోతుల ఈశ్వరరావు, కోనేటి పారిపల్లి, సారిపల్లి గణపతి, సత్యవతి, సోమేష్, అర్జున్, రంగారావు, ప్రశాంతి, నిర్వాహణ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మలుపుల మాటున ముప్పు!

- దారి కనిపించక ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు



రోడ్డుకు ఇరువైపులా పెరిగిపోయిన తుప్పలు



ప్రమాదకరంగా ఉన్న మలుపు



ప్రమాదకరంగా ఉన్న మలుపు

పెదగంట్యాడ: ఆ మార్గంలో తుప్పలు తిప్పలు పెడుతున్నాయి. వాహన చోదకుల పాలిట యమపాశాలుగా మారుతున్నాయి. దారి పొడువునా రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన మొక్కలతో ఇక్కట్లు పడుతున్నారు. సక్రమంగా దారి కనిపించక పోవడంతో ప్రమాలకు గురవుతున్నారు. మండలంలోని యారాడ తీరానికి నిత్యం వేలాది మంది వెళ్తుంటారు. పర్యాటకుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటోంది. అయితే ఈ తీరానికి పెదగంట్యాడ నుంచి గంగవరం మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. ఈ రహదారి మొత్తం కొండలపై నుంచి ఉండడం.. అది కూడా ఘాట్ రోడ్డు మీదుగా ప్రయాణించాలి. సుమారు ఆరు కిలో మీటర్ల మేర ఈ రోడ్డు విస్తరించింది ఉంది. అయితే ఈ రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో రహదారి కనిపించడం లేదు. అలాగే ప్రమాదకరమైన మలుపు ఉన్నా అక్కడ హెచ్చరిక బోర్డులు కూడా కనిపించక పోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం తుప్పలను తొలగించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజల ప్రాణాల మీదకు వచ్చినా పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు.

సెలవు రోజుల్లో, ఆదివారం, పండగ వంటి రోజుల్లో కుటుంబాలతో కలసి యారాడ వెళ్లే వారు ఎక్కువగా ఉంటారు. ఈ రహదారి ప్రమాదకరంగా మారడంతో వారంతా భయాందోళన చెందుతున్నారు. ప్రమాదకర మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు.

తుప్పలు తొలగించాలి



మేము వారంలో ఒక రోజు యారాడ తీరానికి కుటుంబం, స్నేహితులతో కలసి వెళ్తుంటాం. అయితే ఇరువైపులా మొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో రోడ్డు కనిపించడం లేదు. యారాడ తీరానికి వెళ్లేందుకు పెదగంట్యాడ నుంచి బస్సు సౌకర్యం లేకపోవడంతో ద్విచక్ర వాహనాలు.. కార్లలో వెళ్లాల్సి వస్తోంది. అధికారులు స్పందించి పర్యాటక ప్రాంతానికి వెళ్లే రోడ్డులో తుప్పలు తొలగించాలి.

–గొందేశి పెంటయ్యరెడ్డి, పెదగంట్యాడ.

నేడు రెండు ప్రాంతాల్లో ‘స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్–స్వచ్ఛ విశాఖ’

విశాఖ సిటీ: స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో ప్రతి నెల 3వ శనివారం ‘స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్–స్వచ్ఛ విశాఖ’ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం(18వ తేదీ) ఉదయం 10 గంటలకు సెంట్రల్ పార్క్ వద్ద, అనంతరం 11.30 గంటలకు వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో ప్రతిజ్ఞ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి సామాజిక బాధ్యతగా తన పరిసరాలతో పాటు కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనవసరమైన కాగితాలను తొలగించాలని తెలిపారు. సంస్థ నిర్వహణలో ఉన్న అన్ని పార్క్‌లలో చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని, అదేవిధంగా వీఎంఆర్‌డీఏ పరిధిలోని వాణిజ్య సముదాయాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని శత శాతం నిషేధించాలని ఆదేశించారు. తప్పని సరిగా వస్త్ర లేదా కాగితపు సంచులను మాత్రమే ఉపయోగించాలన్నారు. విధిగా పొడి చెత్త, తడి చెత్తలకే వేర్వేరుగా చెత్త బుట్టలను వినియోగించాలని సూచించారు.